నర్సులే.. డాక్టర్లు


ఆస్పత్రిలో ఓపీ చూస్తున్న నర్సు


నవాబుపేట పీహెచ్‌సీ

- పీహెచ్‌సీలో వైద్యులు కరువు
- సబ్‌సెంటర్లలోనూ సిబ్బంది కొరత
- సామాన్యులకు తప్పని ఇబ్బందులు

నవాబుపేట: మండల పరిధిలో పేద ప్రజలకు వైద్యం అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. అసలే సీజనల్ వ్యాధుల కాలం..ఆపై ఆస్పత్రిలో వైద్యుల కొరత సామాన్యులకు వైద్యం అందిచడంలో అడ్డంకులుగా మారుతున్నాయని చెబుతున్నారు. మండలంలో 54 గ్రామాలకు ఒకే ఒక పీహెచ్‌సీ ఉందని.. దీనికి తోడు అరకొర డాక్టర్లు ఇలా సమస్యల నేపథ్యంలో అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు. పీహెచ్‌సీకి ఉండాల్సిన ఇద్దరు డాక్టర్లు లేకపోగా ఒక్కడే ఉన్నారని అంటున్నారు. అయన సైతం అదనంగా జిల్లా బాధ్యతలు నిర్వహిస్తున్నారని చెబుతున్నారు. దీంతో ఆస్పత్రిలో నర్సులే డాక్టర్లుగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారే ఓపీ చూస్తున్నారని.. వారే అన్ని చేస్తున్నారని చెబుతున్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

సబ్‌సెంటర్లలోనూ సిబ్బంది కొరత

మండలంలోని గ్రామాల్లో ఉన్న సబ్ సెంటర్లకు సైతం సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. మొత్తం 11 సబ్‌సెంటర్లలో 6 చోట్ల సబ్‌సెంటర్ ఏఎన్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రధానంగా కొల్లూర్, రుద్రారం, ఇప్పటూర్, చౌడూర్, లింగంపల్లి, నవాబుపేట సబ్‌సెంటర్ల పరిధిలోని అసిస్టెంట్ సిబ్బందితో కాలం గడుపుతున్నారు.

75 వేల జనాభాకు ఒకే పీహెచ్‌సీ..

మండలంలో దాదాపుగా 75 వేలకు పైగా జనాభా ఉన్నా అందరికీ ఒకే ఒక పీహెచ్‌సీ ఉంది. దీంతో పాటు సిబంది కొరత. సామాన్యులకు వైద్యం అందకుండా ఇబ్బంది కలిగించే అంశాలుగా మారాయి. ఈ నేపథ్యంలో వెంటనే ఖాళీలను భర్తీ చేయాల్సిన అవసరం ఉంది. గతంలో కొల్లూర్, కారుకొండ పీహెచ్‌సీల కోసం ఫైల్ కదిలినట్టే కదిలి నిలిచిపోయింది. కాగా మండలానికి అదనంగా మరో రెండు పీహెచ్‌సీలు విధిగా ఏర్పాటు చేయాల్సిన అవశ్యకత ఎంతైన ఉంది.

నర్సులే ఉంటారు..



నవాబుపేట ఆస్పత్రిలో వైద్యుల కొరత ఉంది. దీంతో తప్పని పరిస్థితిలో నర్సులే రోగులను చూసి మందులు ఇస్తారు. మధ్యాహ్నం దాటితే.. ఏఎన్‌ఎంలే దిక్కవుతున్నారు. గ్రామాల్లో బుధ, శనివారం మినహా మిగతా రోజుల్లో ఎవరు ఉండరు. ఇక్కడికి వస్తే డాక్టర్ ఉండరు. ఇలాగైతే పేదలకు వైద్యం ఎలా అందుతుంది.

– ఆంజనేయులు, నవాబుపేట

పీహెచ్‌సీ స్థాయి పెంచాలి



జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డితో మాట్లాడి నవాబుపేట పీహెచ్‌సీ స్థాయిని పెంచాలని కోరతాం. అలాగే మండలంలో అదనపు పీహెచ్‌సీలపై సైతం ఎమ్మెల్యేకు వివరించి వాటిని ఏర్పాటు చేసేలా చేస్తాం. ఇటీవల మండల అభివృద్ధిపై జరిగిన సమీక్షలో ఎమ్మెల్యే సైతం పాల్గొన్నారు. వైద్యం విషయంపై పూర్తి సమాచారం తీసుకున్నారు.

– నర్సింహచారి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నవాబుపేట

ఆస్పత్రి స్థాయి పెంచాలి..

అంతేకాకుండా ప్రస్తుతం నవాబుపేటలో ఉన్న ఆస్పత్రి స్థాయిని పెంచాల్సిన అవసరం ఉంది. గతంలో ఏర్పాటైన ఆరు పడకలతోనే కొనసాగుతోంది. 1977లో మండల జనాభా 15 వేలకు మించి లేకపోవడంతో అప్పట్లో అది సరిపోయింది. కానీ ప్రస్తుతం జనాభా పెరిగింది. అయినా ఆస్పత్రి స్థాయిని పెంచడం లేదు. దీంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పీహెచ్‌సీ స్థాయిని 30 పడకలకు పెంచాల్సిన అవసరం ఉంది.

‘దళితులు స్వేచ్ఛగా బతికే పరిస్థితి లేదు’


డీఎస్పీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మునిమోక్షంలో బుడగ జంగాలపై దాడి చేసిన నిందితులపై హత్యాయత్నం కేసునమోదు చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథిగృహ ఆవరణలో సమావేశంలో మాట్లాడారు. అంబేడ్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం, బుడగ జంగం హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు కొడిగంటి నర్సిములు మాట్లాడారు. గ్రామంలో ఇతర కులానికి చెందిన వారు ఒక పథకం ప్రకారం బుడగ జంగాల కాలనీపై దాడి చేసి ఏడుగురిని గాయపరిచారని తెలిపారు. ఇందులో ఇరువురు తీవ్ర గాయాలపాలై ప్రాణాపాయ స్థితిలో చికిత్స తీసుకున్నారని అన్నారు. మరోమారు దాడి చేసేందుకు కత్తులు, ఇతర మారణాయుధాలతో సుమారు 20 మంది కాలనీలో ప్రవేశించగా, గ్రామస్తులు అడ్డుకున్నారని వివరించారు. ఇంత జరిగినప్పటికీ కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసులు విఫలమయ్యారని ఆరోపించారు. హన్వాడ పోలీస్‌స్టేషన్‌లో నమోదు చేసిన కేసు నామమాత్రంగా ఉందని అన్నారు. ఇప్పటికీ దళితులు స్వేచ్ఛగా బతికే పరిస్థితులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులను అరెస్టు చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం డీఎస్పీ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. జేడీ రమేష్, వెంకటేష్, వీరప్ప, శ్రీనివాస్, సిరిగిరి శ్రీనివాస్, తిరుపతయ్య, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయాలి

భూత్పూర్ : పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులో భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితుల కుటుంబాలకు జీఓనం.2013 అమలు చేసి న్యాయం చేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకుడు బాలకృష్ణ అన్నారు. బుధవారం భూత్పూర్‌లో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర మంత్రులు కర్వెన ప్రాజెక్టును ఎందుకు పరిశీలించలేదని ప్రశ్నించారు. కర్వెన కింద భూములు కోల్పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

బర్ధన్ ఆశయాలను కొనసాగిద్దాం



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): సీపీఐ మాజీ జాతీయ కార్యదర్శి ఏబీ బర్ధన్ ఆశయాలను కొనసాగించాలని జిల్లా కార్యదర్శి బాలకిషన్ అన్నారు. ఆయన శత జయంతి సందర్భంగా బుధవారం పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా నాయకులు కొండపల్లి రాము, సురేష్, చాంద్‌పాషా, శంకర్‌నాయక్, సత్యనారాయణరెడ్డి, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం


ర్యాలీలో పాల్గొన్న కళాశాల విద్యార్థులు

పాలమూరు: ప్రతి ఆస్పత్రిలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకంగా ఉంటుందని జిల్లావైద్యా ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ పద్మ అన్నారు. ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా బుధవారం పాత వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఫార్మాసిస్టులను ప్రత్యేక జ్ఞాపికలతో సన్మానించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిని పద్మజా, శ్రీధర్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, శశికాంత్, రఫీక్ పాల్గొన్నారు.

- ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం సందర్భంగా సరోజిని రాములమ్మ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం జడ్పీ మైదానం నుంచి తెలంగాణ చౌరస్తా మీదుగా ఆ తర్వాత బీకే రెడ్డి కాలనీ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ బాలరాజు మాట్లాడారు. వైద్యరంగంలో ఫార్మసిస్టుల పాత్ర చాలా కీలకమన్నారు. డైరెక్టర్ శిరీష, పద్మలత, ప్రిన్సిపాల్ మాంగీలాల్ పాల్గొన్నారు.

మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు

ధన్వాడ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో మండల స్థాయి 68 ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలలకు చెందిన అండర్–14, 17 బాలికలకు క్రీడాపోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ పోటీలలో విద్యార్థులు ప్రతిభ కనపరిచారు. నేడు బాలురకు పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్‌ఎం నరసింహచారి తెలిపారు. ఎంఈఓ గాయత్రి, పీటీ రాంమోహన్‌గౌడ్ పాల్గొన్నారు.

కర పత్రం విడుదల

మరికల్: జిల్లా కేంద్రంలో నిర్వహించే సమాచార హక్కు చట్టం అవగాహన సదస్సు సందర్భంగా బుధవారం మరికల్ తహసీల్దార్ జమీల్ సమాచార హక్కు చట్టం కర పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించే సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ అవగాహన సదస్సును జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో సందకృష్ణ, వెంకటేష్ యాదవ్, రామకృష్ణ, రాజు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌పై ‘స్వచ్ఛత హీ సేవ’


మినీ ట్యాంక్ బండ్ పరిసరాల్లో చెత్తను సేకరిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి తదితరులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ‘స్వచ్ఛతాహీ సేవ’లో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్) పరిసరాలను మున్సిపల్, మెప్మా అధికారులు, సిబ్బందితో పాటు స్థానికులు కలిసి శుభ్రం చేశారు. అలాగే ఎక్కడికక్కడ పేరుకుపోయిన సుమారు మూడు వేల కిలోల చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించారు. మున్సిపల్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం బాధ్యత అని అన్నారు. కార్యక్రమం వచ్చే నెల 2వరకు కొనసాగుతుందన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవీందర్‌రెడ్డి, గురులింగం, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ చరణ్, ఎస్‌బీఎం కన్సల్టెంట్ సుమీత్‌రాజ్, మెప్మా సీఓ యాదయ్య పాల్గొన్నారు.

లైన్‌మేన్ నిర్లక్ష్యమే కారణం

చిన్నచింతకుంట: లైన్‌మేన్ ఎండీ గౌస్ నిర్లక్ష్యంతోనే పంచాయతీ కార్మికుడు హరిజన్ లక్ష్మన్న మృతి చెందాడని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జేఎన్ దేవదానం, సాంబశివుడు, గణేష్ ఆరోపించారు. బుధవారం దాసర్‌పల్లిలో విద్యుత్ షాక్‌తో మరణించిన లక్ష్మన్నకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం లక్ష్మన్న కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

నివాళి

దేవరకద్ర: పుట్టపల్లికి చెందిన రిటైర్ ఉద్యోగి వెంకటస్వామి(70) ఇటీవల మృతి చెందగా బుధవారం ఆయన నివాసంలో దశదినకర్మ నిర్వహించారు. మండల కాంగ్రెస్ నాయకుడు కోన రాజశేఖర్, గోపన్‌పల్లి నాయకుడు సురేందర్‌రెడ్డి, నార్లోనికుంట్ల మాజీ సర్పంచ్ రామాంజనేయులు, రాజుగౌడ్, రామస్వామి తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

సమస్యలను పరిష్కరించండి

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలో గత మార్చి నెల నుంచి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన ఆర్థిక ప్రయోజనాలు ఈ–కుబేర్‌లో పెండింగ్ ఉంచడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని.. సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించాలని నాయకులు అన్నారు. ఈ మేరకు ఆల్‌మేవా ప్రతినిధులు బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కోదండరాంకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎస్.ఎ.వహీద్‌షా, సహాయ కార్యదర్శి డాక్టర్ షేక్ ఫరీద్, సలహాదారు యూసుఫ్‌బిన్ నాసర్ ఉన్నారు.



శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


మాట్లాడుతున్న డీఈ అర్చన

జడ్చర్ల టౌన్: గ్రామాల్లో నీటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు గానూ ఇస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని మిషన్‌భగీరథ ఇంట్రా డీఈ అర్చన.. వాటర్‌మేన్‌లకు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో వారికి నాలుగు రోజుల శిక్షణ శిబిరంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. మొదటి రోజున సింగల్‌ఫేస్ మోటర్ల పనితీరు, వాటి మరమ్మతు గురించి శిక్షణ ఇవ్వగా.. రెండవ రోజు బుధవారం పైప్‌లైన్‌ల లీకేజీలు, ఫిట్టింగ్‌పై ప్రదర్శనలతోపాటు శిక్షణ ఇచ్చారు. ఏఈ లక్ష్మణ్‌కుమార్ మండలంలోని 45 గ్రామపంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి


నివాళులు అర్పిస్తున్న నాయకులు

పాలమూరు: జిల్లా కేంద్రంలోని కురుహిని శెట్టి కాలనీలో బుధవారం పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతికుమార్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు టి.ఆచారి హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆ తర్వాత ఏర్పాటు చేసిన సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పలువురికి సభ్యత్వ నమోదు చేయించారు. అంతకుముందు జిల్లా కార్యాలయంలోనూ జయంతి కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నేతలు కొండయ్య, రాములు, సెంథిల్, రాజేందర్ రెడ్డి, వీర బ్రహ్మాచారి, అంజయ్య పాల్గొన్నారు.

సాంకేతిక రంగంపై విద్యార్థులకు అవగాహన


చంద్రయాన్3 గురించి వివరిస్తున్న నర్సోజీ

జడ్చర్ల టౌన్: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, రిటైర్డ్ ఉపాధ్యాయుడు నర్సోజీ బుధవారం పట్టణంలోని బాదేపల్లి జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు సాంకేతిక రంగంపై అవగాహన కల్పించారు. చంద్రయాన్ 3 నమూనాను ప్రదర్శించి విద్యార్థులకు వివరించారు. భారతదేశం శాస్త్ర సాంకేతిక రంగంలో సాధిస్తున్న విజయాల గురించి వివరించారు. విద్యార్థులు చదువుతోపాటు విజ్ఞానం పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రకళ, ఉపాధ్యాయులు గోపాల్, ఇబ్రహీం, సునీల్‌కుమార్, శంకర్‌బాబు, యుగంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి ఆచూకీ తెలపండి


ఫిర్యాదు చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

జడ్చర్ల టౌన్: తమ గ్రామంలో పనిచేయాల్సిన ఎస్‌జీటీ ఉపాధ్యాయుడు శంకర్‌రావు ఆచూడీ తెలపాలంటూ ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బుధవారం జడ్చర్ల ఎమ్మార్వోలో ఫిర్యాదు చేశారు. రెండు నెలలుగా పాఠశాలకు రాకుండా జీతం మాత్రం పొందుతున్నాడని ఫిర్యాదులో పొందుపర్చారు. ఎలాంటి డిప్యుటేషన్ ఆదేశాలు లేకుండా స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఎలా జీతం వేస్తున్నారని ప్రశ్నించారు. వెంటనే పాఠశాలకు రప్పించి జీతం రికవరి చేయాలన్నారు. హెచ్‌ఎంను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు భరత్, ఎస్‌ఎఫ్‌జీ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ ఉన్నారు. కాగా వివరాల కోసం కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకట్‌రెడ్డికి ఫోన్ చేయగా అందుబాటులోకి రాలేదు. ఎంఈఓ మంజులాదేవిని వివరణ కోరగా డీఈఓ ఆదేశాలతో ఎర్రవల్లితండాలో శంకర్‌రావు విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కోనేరు వద్ద చెత్త తొలగింపు


కోనేరు శుభ్రం చేస్తున్న వలంటీర్లు, సిబ్బంది

జడ్చర్ల టౌన్: స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని 11 వ వార్డు వెంకటేశ్వరస్వామి ఆలయ కోనేరులో పిచ్చిమొక్కల తొలగింపు చేపట్టారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ 3 ప్రోగ్రాం ఆఫీసర్ సదాశివయ్య ఆధ్వర్యంలో పదిమంది వలంటీర్లు కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరికి మున్సిపాలిటీ సిబ్బంది సహకారం అందించారు. మున్సిపల్ కమిషనర్ రాజయ్య, బీఆర్‌ఎస్ నాయకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

రేషన్ సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదు


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

మిడ్జిల్: మండల పరిధిలోని వెలుగొమ్ముల రేషన్ డీలర్ అరుణ షాప్‌ను నిబంధనలకు వ్యతిరేకంగా ఇంట్లో నిర్వహిస్తున్నారని.. సక్రమంగా సరుకులు ఇవ్వడంలో విఫలమవుతున్నారని గ్రామస్తులు అన్నారు. బుధవారం తహసీల్దార్ రాజుకు సంతకాలతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. కాగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు. బాబా, బాల్‌రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓకు సన్మానం


గండేడ్ ఎంఈఓ జనార్దన్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

గండేడ్: మండల విద్యాధికారిగా ఆర్ జనార్దన్ నియమితులయ్యారు. బుధవారం మండల కేంద్రంలో ఆయా సంఘాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. గండేడ్ హెచ్‌ఎంగా ఉన్న ఆయనకు బాధ్యతలు అప్పగించడంపై నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడారు.తనకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు. విద్యావ్యవస్థకు తగిన న్యాయం చేస్తానని పేర్కొన్నారు. పీఆర్‌టీయూ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కృష్ణయ్య, యూటీఎఫ్ అధ్యక్ష కార్యదర్శులు గంటశ్రీనివాస్, గోవిందు, బోరు కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

అడ్డాకుల: కందూర్‌కి చెందిన హరిజన్ బందెమ్మ అనారోగ్యానికి గురై చనిపోవడంతో బాధిత కుటుంబాన్ని బుధవారం బీజేపీ జిల్లా నాయకుడు మున్నూర్ రమేష్ పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ.5వేలను అందజేసి అండగా ఉంటామన్నారు. నాయకులు తదితరులు ఉన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓలు

సాక్షినెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా బుధవారం పలువురు ఎంఈఓలు బాధ్యతలు స్వీకరించారు.

- కందూర్ జీహెచ్‌ఎం కురుమూర్తిని అడ్డాకుల ఎంఈఓగా బాధ్యతలు తీసుకున్నారు.
- మిడ్జిల్ మండల విద్యాధికారిగా అయ్యవారిపల్లి జెడ్పీహైస్కూల్ హెచ్‌ఎం సుధాకర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు.
- నవాబుపేట మండలానికి నూతనంగా మండల కేంద్రంలోని హైస్కూల్ హెచ్‌ఎం నాగ్యానాయక్‌ను ఎంఈఓగా నియమించారు.
- హన్వాడ ఎంఈఓగా వేపూర్ జెడ్పీహెచ్‌ఎస్ జీహెచ్‌ఎం గోపాల్‌నాయక్, మహమ్మదాబాద్ మండల విద్యాధికారిగా మండలంలోని ఉన్నత పాఠశాల జీహెచ్‌ఎం రాజునాయక్ బాధ్యతలు తీసుకున్నారు.
- చిన్నచింతకుంట విద్యాధికారిగా మురళీ కృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు.

అదేవిధంగా మూసాపేట మండల తహసీల్దార్‌గా ఆర్.రాజు బాధ్యతలు చేపట్టారు.

వినియోగదారుడికి న్యాయం

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వినియోగదారుల కమిషన్ తీర్పుతో వినియోగదారుడు నాగరాజుకు న్యాయం జరిగిందని కన్జూమర్ అవేర్‌నెస్ ప్రొటెక్షన్ అండ్ వెల్ఫేర్ సొసైటీ జిలా అధ్యక్షుడు ఆడమ్స్ అన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో మాట్లాడారు. నాగరాజు తన తల్లి పేరుపై ఎల్‌ఐసీ చేశాడన్నారు. ఆమె మృతి చెందగా నామిని అయిన నాగరాజుకు ఎల్‌ఐసీ డబ్బులు చెల్లించలేదన్నారు. వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించగా నాగరాజుకు అనుకూలంగా తీర్పు వచ్చినట్లు వివరించారు. రూ. 2 లక్షలు అతడికి ఇప్పించినట్లు వివరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు విజయ్‌మోహన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలు అరికట్టాలి

నవాబుపేట: బాల్య వివాహాలను అరికట్టాల్సిన అవసరం ఉందని సీడీపీఓ నర్మద, కోఆర్డినేటర్ వెంకమ్మలు తెలిపారు. బుధవారం మండలకేంద్రంలో వివిధ శాఖల అధికారులతో కలిసి బాల్య వివాహాల నిషేధచట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ జయరాంనాయక్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజరాజేశ్వరీ, పారిజాత, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి



రాజాపూర్(బాలానగర్): విద్యార్థులు సేవాగుణాన్ని అలవర్చుకోవాలని బాలానగర్ మండల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌లింగం పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ డే పురస్కరించుకుని ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ హరీష్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం



జడ్చర్ల: సంపూర్ణ పోషకాహారంతోనే ఆరోగ్యం సాధ్యమని అంగన్‌వాడీ సూపర్ వైజర్ కల్పన పేర్కొన్నారు. కోడ్గల్‌లో బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవం నిర్వహించారు. మాజీ సర్పంచ్ మమత తదితరులు పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు



అడ్డాకుల: ఉపాధ్యాయులకు వారు చేసే సేవలతోనే తగిన గుర్తింపు లభిస్తుందని హెచ్‌ఎం నరసింహ అన్నారు. నందిపేట పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రవినాయక్, ఉమర్‌ఖాన్, యాదయ్య.. పాఠశాలకు కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు శ్రీదేవి, సత్యయ్య, రాజులను గ్రామస్తులు సన్మానించారు. నాగేశ్వర్‌రెడ్డి, నర్సింహ, వెంకట్రాములు తదితరులు ఉన్నారు.

జమియతే ఉల్మా జిల్లా కమిటీ ఎన్నిక



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రంలో బుధవారం జమియతే ఉల్మా (మహమూద్ మదని) జిల్లా కమిటీ ఎన్నికలు నిర్వహించారు. సంస్థ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రధాన కార్యదర్శి ముఫ్తి మహ్మద్ జుబేర్, మౌలానా ఫసివుద్దీన్ సమక్షంలో కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మౌలానా నాసిర్ మజహరి, ఉపాధ్యక్షులుగా మౌలానా నూరుద్దీన్, మౌలానా అబ్దుల్ ఖయ్యూం అతీఖ్, ప్రధాన కార్యదర్శిగా మౌలానా ఖాలిద్ రషాది, కార్యదర్శిగా హాఫిజ్ గియాసుద్దీన్, కోశాధికారులుగా హాఫిజ్ నవీద్, హాఫిజ్ అబ్దుల్ సుబూర్‌ఖాన్, సంయుక్త కార్యదర్శిగా హాఫిజ్ సఫ్దర్, అధికార ప్రతినిధిగా మౌల్వి ఇస్మాయిల్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం ప్రత్యేక దువా చేశారు. మౌలానా ఖాసిం, మౌలానా అనస్ అబ్దుల్లా, హాఫిజ్ ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

అంజన్నకు పూజలు

దేవరకద్ర: చిన్నరాజమూర్ ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం ఘనంగా పూజలు నిర్వహించారు. భాద్రపద బహుళ అష్టమి సందర్భంగా స్వామి వారికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ప్రత్యేకంగా స్వామివారిని అలంకరించారు.

రక్తదాన శిబిరం

జడ్చర్ల టౌన్: పోలేపల్లి ఫార్మాసెజ్‌లోని శిల్పామెడికేర్ లిమిటెడ్‌లో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. మెడికేర్ ఎండీ విష్ణుకాంత్ చతుర్భుజ్ జన్మదినం పురస్కరించుకుని రెడ్‌క్రాస్ సహకారంతో కార్యక్రమం చేపట్టారు. 55మంది రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ లయన్ నటరాజ్, హెచ్ఆర్ ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు ఈశ్వర్, రెడ్‌క్రాస్ సిబ్బంది కృష్ణవేణి, రాములు, శంకర్, రాజులు పాల్గొన్నారు.